సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం ׀ 29 ׀ నవంబర్ ׀ 2024



ప్రోత్సహించాలి

గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించాలని జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదా వెంకట్‌రెడ్డి అన్నారు. 8లో▸



రైతులకు సబ్సిడీ పథకాలు

గత ప్రభుత్వం వ్యవసాయ సంబంధిత సబ్సిడీ పథకాలకు మంగళం పాడిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



అవగాహన పెంచండి

గ్రామీణ ప్రాంత ప్రజలకు డయల్ 100 పై విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని డీసీపీ రాజేశ్ సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

రీడిప్లాయ్డ్ వీఆర్‌ఓలకు న్యాయం చేయండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మాతృశాఖ సీనియార్టీ జాబితాలో ఇతరశాఖల్లో పని చేస్తున్న వీఆర్‌ఓను చేర్చకపోవడంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రీడిప్లాయ్డ్ వీఆర్‌ఓల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం ప్రతినిధులు కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇతర శాఖల్లో పని చేస్తున్న వీఆర్‌ఓల సీనియార్టీని లెక్కించకపోవడంతో పదోన్నతుల్లో తీరని అన్యాయం జరుగుతోందని, కనీసం మాతృశాఖలోనైనా తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. డిపార్ట్‌మెంట్ టెస్టులు పాసైనప్పటికీ.. అర్హత ఉన్నవాళ్లకు పదోన్నతులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్–4లో నోటిఫై చేసిన పోస్టుల్లో వీఆర్‌ఓలను నియమించడం వల్ల ప్రస్తుతం గ్రూప్–4లో ఎంపికైన వారికి పోస్టింగ్ ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. ఇతర శాఖల్లో పని చేస్తున్న వీఆర్‌ఓలను వెంటనే మాతృశాఖకు తీసుకుని, వారి సీనియార్టీ లెక్కించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ముత్యాలు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, దయానంద్, వెంకటేశ్, అజీజ్, మన్నెయ్య, రఘుపతి రెడ్డి, శైలజ, భార్గవి, కవిత, సభ్యులు శ్రావణి, భాగ్యలక్ష్మి, శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు భవనాల పరిశీలన



నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కొత్తూరు: పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా పీహెచ్‌సీ ఏర్పాటుకు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు గురువారం పలు భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పీహెచ్‌సీ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో నందిగామ మండల పరిధిలో ఉంది. అక్కడికి వైద్యం కోసం వెళ్లేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిల్లా వైద్యాధికారితో చర్చించి పట్టణంలో పీహెచ్‌సీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఇందులో భాగంగా ఆయన పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం, ఎమ్మార్సీ, మహిళా సమాఖ్య, సమీకృత మార్కెట్ భవనాలను పరిశీలించారు. ఇందులో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్ భవనం ఆస్పత్రి ఏర్పాటుకు అనుకూలంగా ఉందని డీఎంహెచ్‌ఓ తెలిపారు. భవన నిర్మాణాన్ని పూర్తి చేసిస్తే పీహెచ్‌సీని ఇక్కడికి తరలించడానికి ఉన్నతాధికారులతో చర్చిస్తామని వివరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్ తదితరులు ఉన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్: మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక విప్లవ కారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, తెలంగాణ జన సమితి నియోజకవర్గం ఇన్‌చార్జి నాగని రామకృష్ణ పేర్కొన్నారు. జ్యోతి రావు పూలే వర్ధంతి సందర్భంగా షాబాద్, నాగర్‌గూడలో గురువారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాను అనుభవించిన వివక్ష మరెవరూ అనుభవించకూడదనేది జ్యోతి రావు పూలే ఆకాంక్ష అని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌యాదవ్, కేతన రమేష్ యాదవ్, సుబ్రహ్మణ్యేశ్వరి రవీందర్, తెలంగాణ ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోల్ నర్సింహులు, రజక సంఘం జిల్లా అధక్షులు గడ్డం చంద్రయ్య, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ.. పూర్తయ్యేనా?

నిలిచిన యాచారం–మీరాఖాన్‌పేట రోడ్డు వెడల్పు పనులు

- అప్పట్లో రూ.వంద కోట్లకుపైగా నిధులు మంజూరు
- మట్టితో చదును చేసి వదిలేసిన వైనం
- వాహనాల రాకపోకలతో దుమ్ముధూళి మయం
- ప్రయాణికులకు ఇబ్బందులు



అర్ధంతరంగా నిలిచిపోయిన యాచారం–మీరాఖాన్‌పేట రోడ్డు విస్తరణ పనులు

యాచారం: రెండేళ్లుగా యాచారం–మీరాఖాన్‌పేట రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో యాచారం, కందుకూరు మండలాల పరిధిలో ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యాచారం–మీరాఖాన్‌పేట గ్రామాల మధ్య 15 కిలోమీటర్ల మేర వంద అడుగుల రోడ్డు విస్తరణకు అప్పటి ప్రభుత్వం రూ.100 కోట్లకు పైగా (టీజీఐఐసీ) నిధులు మంజూరు చేసింది. అప్పట్లోనే రోడ్డు భవనాల శాఖ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించింది. మీరాఖాన్‌పేట నుంచి నస్దిక్‌సింగారం మీదుగా నందివనపర్తి వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించి మట్టిని చదును చేశారు. నందివనపర్తి– నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్య ఐదు కిలోమీటర్ల రోడ్డును సైతం వంద అడుగులుగా విస్తరించడానికి అధికారులు పనులు ప్రారంభించారు. నందివనపర్తి–నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్య కల్వర్టులను సైతం నిర్మించారు. విస్తరణ కోసం రోడ్డుపై చదును చేసిన మట్టి వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పరిహారంపై స్పష్టత లేకే..

రోడ్డు విస్తరణలో కోల్పోయే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు విషయంలో స్పష్టత లేకపోవడంతోనే రైతులు భూములు ఇవ్వడానికి నిరాకరించారు. నందివనపర్తి–మీరాఖాన్‌పేట, నందివనపర్తి–నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్య వంద అడుగుల రోడ్డు విస్తరణకు గాను 60 మంది రైతులకు చెందిన 120 ఎకరాల వ్యవసాయ భూమి పోతుంది. అప్పట్లో రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు ఎకరా భూమికి రూ. 16 లక్షల పరిహారం ఇవ్వడానికి నిర్ణయించారు. నందివనపర్తిలో భూములు కోల్పోయే రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ సభ పెడితే గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. సభను అడ్డుకుని, అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. దీంతో సభ నిలిచిపోవడంతో పాటు పరిహారం చెల్లింపుపై స్పష్టత లేకుండా పోయింది. సభను అడ్డుకున్నారని అప్పటి అధికారులు రైతులపై కేసులు పెట్టగా కొంతమంది జైలుకు వెళ్లి వచ్చారు.

రూ.50లక్షల పరిహారమైతే ఓకే..

రేవంత్‌రెడ్డి సర్కార్ ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫ్యూచర్‌సిటీ పేరుతో పలు సంస్థలకు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో యాచారం–కందుకూరు మండలాల పరిధిలోని మీరాఖాన్‌పేట, నస్దిక్‌సింగారం, నందివనపర్తి, చింతుల్ల, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, చౌదర్‌పల్లి, యాచారం గ్రామాల్లోని వ్యవసాయ భూములకు ధరలు అమాంతం పెరిగాయి. ఎకరాకు రూ.50 లక్షల పరిహారంతో పాటు 121 గజాల ప్లాటు, ఇతర ప్రయోజనాలు కల్పిస్తే భూములిచ్చేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

స్పష్టమైన హామీ లేదు



నందివనపర్తి–నస్దిక్‌సింగారం గ్రామాల మధ్యన రోడ్డు విస్తరణలో 10 గుంటల వ్యవసాయ భూమి పోతుంది. పరిహారం చెల్లింపు విషయంలో అధికారుల నుంచి స్పష్టమైన హామీ లేదు. రూ.50 లక్షల పరిహారం ఇస్తే భూమి ఇస్తాం. అదేవిధంగా అప్పట్లో పెట్టిన కేసులు కూడా ఎత్తేయాలి.

– కొందూరి రామనాథం, రైతు, నందివనపర్తి

సీఎం దృష్టికి తీసుకెళ్తా



యాచారం–మీరాఖాన్‌పేట, నందివనపర్తి–నక్కర్తమేడిపల్లి గ్రామాల మధ్య వంద అడుగుల రోడ్డు విస్తరణలో కోల్పోయే భూమికి న్యాయమైన పరిహారం అందజేస్తాం. పరిహారం పెంచే విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతా. విస్తరణ పనులు త్వరగా ప్రారంభించేలా కృషి చేస్తా.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం



జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నేతలు

కలెక్టరేట్‌లో హాల్ కేటాయించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘానికి కలెక్టరేట్‌లో ఒక హాల్ కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, సెక్రెటరీ శ్రీనేష్‌కుమార్ నోరీ కోరారు. జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. సంఘం భవనానికి స్థలం కేటాయించాలని తీర్మానించారు. అనంతరం కొత్త వైస్ ప్రెసిడెంట్లుగా బాలరాజుగౌడ్, గంపా శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలుగా సైదమ్మ, మహేందర్, భూక్యా రాజేష్, నాగేశ్వర్‌రావును నామినేట్ చేశారు. కార్యక్రమంలో టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామకృష్ణ, శ్రీరామ్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశం, ట్రెజరర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వెంకట్, అలివేలు మంగ, రేవతి, సహాయ కార్యదర్శులు లక్ష్మణ స్వామి, మహేశ్వరి, డాక్టర్ కె.నారేందర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులను అరికట్టాలి



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న రాంబల్ నాయక్

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్: గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ అన్నారు. పట్టణంలో గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంబల్ నాయక్ మాట్లాడుతూ.. లంబాడీలపై దమనకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లగచర్లలో గిరిజనుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కొని ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తోందని మండిపడ్డారు. గిరిజనులు తమ భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తే ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదువుకు దూరం చేస్తోందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, దీంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్ నాయక్, ఉపాధ్యక్షులుగా సుధాకర్ నాయక్, బీక్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ నాయక్, రాము నాయక్, సీతారాం, కార్యదర్శిగా మోతిలాల్ నాయక్, సలహాదారులుగా చందర్ నాయక్, లక్ష్మణ్ నాయక్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు రాంబల్ నాయక్ నియామక పత్రాలు అందజేశారు. మున్సిపాలిటీ అధ్యక్షుడిగా శివాజీ నాయక్, కేశంపేట మండల అధ్యక్షుడిగా జర్పుల రాజు నాయక్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా బాబు రాజ్ నాయక్, నందిగామ మండల అధ్యక్షుడిగా రాము, ఫరూఖ్‌నగర్ అధ్యక్షుడిగా సంతోష్, కొందుర్గు అధ్యక్షుడిగా కేతావత్ గోపాల్ నాయక్‌ను ఎన్నుకున్నారు.

డేటా ఎంట్రీని పక్కాగా నిర్వహించాలి

చేవెళ్ల: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీని పక్కగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో సర్వే ఎంట్రీని గురువారం ఆయన ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, సూపరింటెండెంట్ రవీందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఆపరేటర్లు, ఎన్యుమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డేటా ఎంట్రీకి ఈనెలాఖరు వరకు సమయం ఉన్నందున త్వరగా నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే మరింత మంది ఆపరేటర్లు, కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక అధికారులు, సిబ్బంది ఉన్నారు.



చేవెళ్ల: ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

తప్పులు లేకుండా నమోదు చేయాలి

షాబాద్: సర్వే డేటాను ఆపరేటర్లు తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ జరుగుతున్న విధానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఎంట్రీని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆపరేటర్ వారికి కేటాయించిన డేటా ఎంట్రీ సెంటర్‌లో ప్రతిరోజు సుమారు 25 సర్వే ఫారాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. డేటా నమోదు సమయంలో సంబంధిత ఎన్యుమరేటర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఆపరేటర్ పక్కన ఉండి తప్పులు లేకుండా నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా భూముల్లో కలెక్టర్ పర్యటన

యాచారం: కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో గోప్యంగా పర్యటించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డితో కలిసి స్కిల్ యూనివర్సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన బెగరికంచె ప్రాంతం, ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు ఇవ్వనున్న మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్, కుర్మిద్దలో ఫార్మాసిటీకి సేకరించిన పట్టా, అసైన్డ్ భూములను పరిశీలించారు. ఫార్మాసిటీకి ఎన్ని వేల ఎకరాలు సేకరించారు.. రైతులకు పరిహారం ఏ విధంగా ఇచ్చారు.. ఎకరాకు ఎన్ని గజాల ప్లాట్లు ఇస్తున్నారు.. హెచ్‌ఎండీఏ వెంచర్‌లో అభివృద్ధి పనులు ఎందుకు ముందుకు సాగడం లేదనే వివరాలను ఆర్డీఓ అనంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో సర్కార్ చేపట్టనున్న ఫ్యూచర్‌సిటీకి ఎన్ని ఎకరాలు కేటాయిస్తున్నారు.. ఏఏ సంస్థలకు కేటాయిస్తున్నారనే వివరాలపై ఆరా తీసినట్లు తెలిసింది.

ఆర్టీఏకు వచ్చిన సినీ నటుడు నాగార్జున

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. తాను కొత్తగా కొనుగోలు చేసిన కారు టయోటా లెక్సస్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జేటీసీ రమేష్, ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తంరెడ్డి, తదితరులు వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. కొత్త వాహనాన్ని 'టీజీ 09 సి 9669' నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున డిజిటల్ సంతకం చేయడంతో పాటు, ఫొటో, చిరునామా తదితర వివరాలను అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొయినాబాద్, రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందొచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేశ్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కిషన్ రావు అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి రైతు వేదికలో గురువారం రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మామిడి, కూరగాయలు, పువ్వులు, ఆయిల్‌పామ్ పంటల సాగుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. పంటల ఉత్పత్తిని పెంచే విధానాలు, కొత్త వ్యవసాయ అవకాశాలను అన్వేషించడానికి రైతులు ముందుకు రావాలన్నారు. ఆయిల్ పామ్‌ను ఒకసారి సాగుచేస్తే 30 ఏళ్ల పాటు లాభాలు పొందొచ్చన్నారు. మొక్కలు నాటడానికి ఈజీఎస్ పథకంలో కూలీను వాడుకోవచ్చని, సబ్సిడీపై పరికరాలు పొందొచ్చని సూచించారు. సాగు చేసిన నాటి నుంచి మూడేళ్ల వరకు రూ.4,500 చొప్పున ప్రభుత్వం రైతు ఖాతాలో జమచేస్తుందని, నాలుగో ఏట నుంచి పంట దిగుబడులు ప్రారంభమవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఏఓ అనురాధ, హార్టికల్చర్ అధికారులు శ్రీకృష్ణ, బాబు, కీర్తి, కృష్ణ, రామ్మోహన్‌రావు, కుమార్, ఉదయ, కిరణ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫార్మాసిటీ ఠాణాను సందర్శించిన ఏసీపీ



సిబ్బందితో సమావేశమైన ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు గురువారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీఐ కృష్ణంరాజు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధుల్లో నిర్లక్ష్యం వద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్ నివారణ కోసం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మీరాఖాన్‌పేటలో ఉన్న అమేజాన్ డేటా సెంటర్‌ను సందర్శించారు. యువతకు కల్పించే ఉద్యోగావకాశాలపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ప్రగతి భేష్

డీఆర్‌డీఓ శ్రీలత

నందిగామ: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యను డీఆర్‌డీఓ శ్రీలత గురువారం సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. బ్యాంకు రుణాలు, చిన్న తరహా వ్యాపార కార్యక్రమాలు, పెరటి కోళ్ల సరాఫరా, ఇందిరా శక్తి క్యాంటిన్‌తో పాటు ప్రభుత్వం మహిళల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు ఏ విధంగా అమలవుతున్నాయనే విషయాలను మహిళా సంఘం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మండల మహిళా సమాఖ్య సాధించిన ప్రగతిని సమీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ రైజింగ్ లోగో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ సూర్యారావు, ఏపీఎం యాదగిరి, సీసీలు అరుణ, అనురాధ, యాదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా సమాఖ్యలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఆర్‌డీఓ శ్రీలత

అధ్వానంగా ఆమనగల్లు–చారకొండ రోడ్డు

నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆమనగల్లు: మండల కేంద్రం నుంచి చారకొండ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. నిత్యం వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయణపల్లి వరకు రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. రోడ్డు అభివృద్ధి పనుల కోసం గత ఏడాది శిలాఫలకం వేసినా నేటికీ ప్రారంభం కాలేదు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి నుంచి మూడు జిల్లాలను కలిపేలా ఆమనగల్లు పట్టణం నుంచి చారకొండ డబుల్‌రోడ్డు ఉంది. అటు నల్లగొండ, ఇటు నాగర్‌కర్నూల్ జిల్లాలను కలుపుతుంది.

గత ఏడాది శంకుస్థాపన

రోడ్డు మరమ్మతులకు గత ప్రభుత్వంలో రూ.2.12 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది ఆగస్టు 29న అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ నిర్వహించినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దీనిపై దృష్టి సారించి రోడ్డు పనులను ప్రారంభించి ఇబ్బందులు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతలమయంగా ఆమనగల్లు–చారకొండ రోడ్డు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదా వెంకట్ రెడ్డి



వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించాలని జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదా వెంకట్‌రెడ్డి అన్నారు. వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో బాల, బాలికలకు నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం, యువతలో స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్‌శ్రీరామ్,ఏబీవీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాండు, కుమార్, అనిల్, గణేశ్, శివ, శేఖర్‌రెడ్డి, వెంకట్, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగకు పదివేల మంది రైతులు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఈ నెల 30న మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్‌లో నిర్వహించే రైతు పండుగ సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పదివేల మంది రైతులను తరలిస్తున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ముఖ్య నాయకులతో రైతుపండుగ సభపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసినట్లు వివరించారు. త్వరలో రైతు భరోసా నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు, హైటెన్షన్ వైర్‌ల తొలగింపు కోసం రూ.2.11 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. రూ.వంద కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లేన్‌ల రోడ్డుగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఖానాపూర్‌లో ఇంట్రిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఆమనగల్లు పట్టణంలో మాడ్గుల రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులకు పరిహారంతో పాటుగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు రైతుపండుగ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవనున్న రైతు పండుగ సభకు భారీ ఎత్తున ప్రజలు హాజరై విజయవతం చేయాలని కోరారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత, పార్టీ నాయకులు హన్మానాయక్, మానయ్య, అజీం, శ్రీశైలం, రమేశ్‌గౌడ్, వెంకటేశ్, బాబా, నాజర్, ఫరీద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో ప్రయాణికులకు బంపర్ ఆఫర్!

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోరైలు ప్రయాణికులకు ఎల్‌అండ్‌టీ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. వరుసగా మూడు నెలల పాటు ప్రయాణించేవారి వివిధ రకాల మెట్రో లాయల్టీ కార్యక్రమంలో భాగంగా బహుమతులను అందజేయనున్నారు. ప్రయాణికుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు, వారితో సత్సంబంధాలను కొనసాగించేందుకు గ్రీన్ మెట్రో లాయల్టీ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. తరచుగా ప్రయాణించే వారికి బహుమతులను అందించడంతో పాటు అంతకు మించిన లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. స్మార్ట్ కార్డ్‌ను వినియోగించి పయనించేవారు కేలండర్ నెల ప్రాతిపదికగా ఎన్ని ట్రిప్పులు ప్రయాణం చేశారనే వివరాల ఆధారంగా లెక్కిస్తారు. సిల్వర్ బ్యాండ్ పొందేందుకు వరుసగా మూడు నెలల కాలంలో 21 నుంచి 35 ట్రిప్పులు, గోల్డ్ బ్యాండ్‌కు 36 నుంచి 50 ట్రిప్పుల వరకు ప్రయాణం చేయాలి. వరుసగా 3 నెలల సమయంలో 51 ట్రిప్పుల కంటే ఎక్కువ ప్రయాణం చేసిన వారికి ప్లాటినం బ్యాండ్ అందజేస్తారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు మూడు నెలల కాల వ్యవధిని ప్రామాణికంగా పరిగణిస్తారు. రానున్న ఉగాదికి బహుమతులు అందజేయనున్నారు.

కడ్తాల్‌లో సిక్కిం ప్రజాప్రతినిధులు

పంచాయతీ పాలనపై సంతృప్తి



సిక్కిం గ్రామ పంచాయతీ ప్రతినిధులతో, అధికారులు, నాయకులు

కడ్తాల్: జాతీయ గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ కేంద్రం ఆధ్వర్యంలో పంచాయతీల పనితీరుపై సిక్కింలోని పంచాయతీల ప్రజాప్రతినిధుల బృందానికి రెండు రోజుల శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా బృందం కోఆర్డినేటర్ జరీనా నేతృత్వంలో కడ్తాల్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ సుజాత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ సొంత ఆదాయ నిధులు వివరాలు, వ్యయాల వివరాలు సిక్కిం ప్రతినిధులకు ప్రత్యేకాధికారి వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, తీసుకుంటున్న జాగ్రత్తలను వివరించారు. పల్లెప్రగతి, తెలంగాణకు హరితహారం, ప్రజా పాలన తదితర కార్యక్రమాలపై సమగ్రంగా వివరించారు. గ్రామసభల ద్వారా ప్రజల భాగస్వామ్యం వివరాలను తెలిపారు. అనంతరం పల్లె ప్రకృతి వనం, రైతువేదిక, వైకుంఠధామం, నర్సరీ, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుకాణాలను బృందం సభ్యులు పరిశీలించారు. వివిధ అభివృద్ధి పనులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విజయ్‌కుమార్‌పాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఏపీఎం రాజేశ్వరి, నాయకులు లాయక్ అలీ, మహేశ్, వెంకటేశ్, ఉపేందర్, మహేశ్, కార్యదర్శి రాఘవేందర్, మహిళా సంఘాల ప్రతినిధులు, సిబ్బంది ఉన్నారు.

రైతులకు సబ్సిడీ పథకాలు

- గత ప్రభుత్వం 'రైతు బంధు' పేరిట రాయితీలకు మంగళం
- ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి వ్యవసాయ సంబంధిత సబ్సిడీ పథకాలకు మంగళం పాడిందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఆయన ముట్పూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. తెలంగాణలో రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘతన రేవంత్‌రెడ్డి సర్కార్‌దే అన్నారు. కొందర్గులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేశామన్నారు. రైతులకు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటుగా రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. బిందు సేద్య పరికారాలను సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. రైతులను ఆదుకుని వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, సింగిల్ విండో సీనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, ఏఓ సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, డైరెక్టర్లు జితేందర్ రెడ్డి, రెడ్యానాయక్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, అంజయ్య, అంజిరెడ్డి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలి

ముట్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పెద్దింటి శృతి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైందని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్వాములు తెలిపారు. రేగడి చిల్కమర్రికి చెందిన శృతి పాఠశాలలో ఆరవ తరగతి చదువుతుందని మంచిర్యాల జిల్లాలో నిర్వహించనున్న పదవ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో శృతి పాల్గొంటుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా శృతిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించి అభినందించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభచూపి పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మంచి భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు.

'డయల్ 100'పై అవగాహన పెంచండి

డీసీపీ రాజేశ్



జిల్లేడ్ చౌదరిగూడ ఠాణా సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్

కొందుర్గు: గ్రామీణ ప్రాంత ప్రజలకు డయల్ 100 పై విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని డీసీపీ రాజేశ్ సూచించారు. గురువారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్ఐఆర్ నమోదుతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు. బాధితులకు ధైర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఎస్ఐ విజయ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మీర్‌పేట: గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుజూసింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. బాలాపూర్ చౌరస్తా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు ఫుట్‌పాత్‌పై గురువారం ఉదయం ఓ వ్యక్తి (60) మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియలేదని.. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తలకొండపల్లి: నగరంలోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన జంగయ్య (40) కుటుంబ సమస్యల కారణంగా ఈ నెల 24న పురుగు మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న జంగయ్య బుధవారం రాత్రి మరణించాడు. మృతుడి తల్లి జంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

శంషాబాద్ రూరల్: పని కోసం వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... నర్కూడకు చెందిన గూడెపు నిఖిల్(25) డ్రైవింగ్ చేసేవాడు. ఈ నెల 26న డ్రైవింగ్ కోసం కొండాపూర్ వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా అచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి కిడ్నాప్ కేసు కొలిక్కి

- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు?
- కంట్రీమేడ్ గన్ స్వాధీనం
- తెలిసిన వారి పనేనని అనుమానం

ఇబ్రహీంపట్నం రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేయడంతో పాటు కణతపై గన్ పెట్టి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసిన నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి రచ్చ నారాయణకు ఓ మహిళ నుంచి పలుసార్లు ఫోన్ కాల్స్ వచ్చాయి. తమ వద్ద తక్కువ ధరకు ప్లాట్లు ఉన్నాయని, వీటిని కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. అదే నంబర్‌తో మరికొందరు వ్యక్తులు ఫోన్ చేసి ప్లాట్లు తీసుకోవాలని కోరారు. ఇది నమ్మిన సదరు వ్యాపారి ఈ నెల 21న తన డ్రైవర్‌తో కలిసి మెట్రో సిటీ వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న నిందితులు.. నారాయణతోపాటు డ్రైవర్‌ను సైతం కారులో ఎక్కించుకుని, ముఖాలకు మాస్క్, చేతులకు కట్లు వేసి గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఓ వ్యక్తి నారాయణ కణతపై రూ.2 కోట్లు ఇవ్వాలని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు చేయించుకుని రాత్రి వేళ ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని నిర్మానుష్య ప్రాంతంలో వదిలేశారు. ఈ విషయమై 22న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణకు ఫోన్ చేసిన మహిళ ఎవరు అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. వ్యాపారికి తెలిసిన వారే ఈ పని చేశారని నిర్ధారించుకున్నారు. ఇబ్రహీంపట్నం సమీప గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు వైద్యుడు ఇందుకు ప్రధాన కారకుడని గుర్తించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. వీరి నుంచి కంట్రీమేడ్ గన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు..

బ్రాహ్మణపల్లి సమీపంలో ఈనెల 14న ట్రాంకిల్ రిసార్ట్‌లో జరిగిన వివాహ వేడుకలో పెళ్లికూతురు బంగారాన్ని చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ బాలుడితో పాటు మరో ఇద్దరిని పట్టుకున్నట్లు సమాచారం. వీరినుంచి భారీ ఎత్తున బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

కళాశాల మేనేజర్‌ను బెదిరిస్తున్న వ్యక్తి అరెస్టు

మణికొండ: కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు ఇవ్వాలని లేదంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయటంతో పాటు దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్న నాగారం ప్రశాంత్‌ను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సమాచారం మేరకు... తమను డబ్బులు, కళాశాలలో సీట్లు ఇవ్వాలని వేధిస్తున్న ప్రశాంత్‌పై చర్యలు తీసుకోవాలని సీవీఆర్ కళాశాల మేనేజర్ శ్రీపతి నారాయణ రెడ్డి నార్సింగి పోలీసులకు ఈ నెల 16వ తేదీన ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు అతను ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉండగా గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దాంతో కోర్టు అతనికి 24 రోజుల జ్యూడీషియల్ కస్టడీ విధించిందన్నారు. ఇలాంటి దోపిడీలు, బెదిరింపులకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

మళ్లీ.. 'మూసీ' అలజడి!

హైకోర్టు తీర్పుతో కదలికలు
- నివాసితులకు నోటీసులు
- ఆందోళనలో బాధితులు

సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహక పరిధిలో మళ్లీ అలజడి రగులుకుంటోంది. హైకోర్టు తీర్పుతో నివాసాల కూల్చివేతలు తప్పవన్న సాంకేతాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. మరోవైపు ఉన్నతస్థాయి ఆదేశాలు అందగానే రంగంలోకి దిగేలా రెవెన్యూ యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమవుతోంది. మూసీ రివర్‌బెడ్, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ జోన్లలోని నిర్మాణాలను తొలగించే సమయంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడటంతో పకడ్బందీగా అడుగులేసేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. తొలుత గుర్తించిన అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసి రంగంలోకి దిగాలని భావిసోంది. మూసీ పునరుజ్జీవ పథకం ఫేజ్–1లో నార్సింగి నుంచి బాపుఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవున, ఫేజ్–2 ప్రాజెక్టు నాగోల్ తట్టిఅన్నారం నుంచి బాచారం వరకు 10 కిలోమీటర్ల పొడవున చేపట్టాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. తొలి ఫేజ్‌లో భారీగా నిర్మాణాలు ఉండగా, రెండో ఫేజ్‌లో మాత్రం పెద్దగా ఆక్రమణలు లేనట్లు తెలుస్తోంది.

తాత్కాలికంగా ఆగినా..

మూసీ నది ప్రక్షాళనలో భాగంగా పరీవాహక పరిధిలోని నివాసాల తొలగింపు వ్యవహారంలో తీవ్ర వ్యతిరేకతతో రెవెన్యూ యంత్రాంగం వెనక్కి తగ్గినా.. హైకోర్టు తీర్పుతో తిరిగి కదలిక వచ్చినట్లయింది. గత నెలలో నదీ గర్భం, బఫర్ జోన్‌లో గుర్తించిన నివాసాలకు పునరావాసం, పరిహారం అంశాలు తేల్చాకే నిర్మాణాలు తొలగింపునకు ముందడుగు వేయాలని నిర్ణయించగా, కొందరు కోర్టును ఆశ్రయించడంతో తీర్పు ప్రభుత్వానికి మరింత కలిసి వచ్చినట్లయింది. వాస్తవంగా మూసీ ప్రక్షాళన కోసం తొలి అడుగులోనే హంసపాదు ఎదురైంది. నదీ పరీవాహక పరిధిలో సర్వే ద్వారా గుర్తించిన నివాసాలపై రెడ్‌మార్కింగ్ వేసే ప్రయత్నమే బెడిసికొట్టాయి. నివాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురుకావడంతో, సగం ఇళ్లకు మాత్రమే రెడ్ మార్క్ వేసి వెనుకకు తగ్గక తప్పలేదు. నిర్వాసితులకు రాజకీయ పక్షాల మద్దతు మరింత కలిసి రావడంతో ఆందోళనలు ఉద్ధృతమైంది. దీంతో నదీ గర్భంలో రెడ్ మార్క్ వేసిన గృహాల జోలికి సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో తాత్కాలికంగా ప్రక్రియ ఆగిపోయింది.

12 వేలకుపైగా ఆక్రమణలు

మూసీ పరీవాహక పరిధిలో 12,184కి పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని రెండుగా వర్గీకరించి నదీ గర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీ గర్భంలో 2,166 నిర్మాణాలు ఉండగా.. 288 భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు ఉండగా.. 1,032 భారీ నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా పరిధిలో 3004 అక్రమ కట్టడాలున్నట్లు బయటపడింది.

ఇక ముందస్తు నోటీసులు

మూసీ ప్రక్షాళనలో భాగంగా రివర్‌బెడ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న ఆక్రమణదారులకు ముందస్తు నోటీసులు జారీ కానున్నాయి. చట్టబద్ధంగా అక్రమ నిర్మాణాలున తొలగించనున్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించనున్నారు. నిర్వాసితులకు సామాజిక, ఆర్థిక సర్వే ఆధారంగా పునరావాసం కల్పించనున్నారు. ఎక్కడైనా పట్టా, శిఖం పట్టా భూములు ఉంటే తగిన పరిహారం చెల్లించి వాటిని భూసేకరణ ద్వారా స్వీకరిస్తారు.. బిల్డింగ్స్ రూల్స్ - 2012ను కచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ అథారిటీలు, సంస్థలు నిర్వహించే సర్వేను, హద్దుల గుర్తింపు ప్రక్రియను అడ్డుకుంటే ఆందోళనకారులపై చర్యలు చేపట్టనున్నారు.